సాక్షి
అన్నమయ్య జిల్లా

శనివారం । 21 । అక్టోబర్ । 2023



పారదర్శకంగా ఎరువుల అమ్మకాలు

జిల్లాలోని అన్ని ఆర్బీకేలలో పారదర్శకంగా ఎరువుల అమ్మకాలను చేపట్టాలని జి పం జం సుకుమార్‌రెడి పేర్కొన్నారు. -IIలో



నిబంధనల ప్రకారం పునరావాస కల్పన

నిబంధనల ప్రకారం వివిధ గ్రామాలప్రజలకు పునరావాసం కల్పించనున్నట్లు ఏపీఎండీసీ ఎండీ వీజీ వెంకట్‌రెడ్డి తెలిపారు. -IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.132
రెండోరకం	రూ.66	రూ.98



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 320 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	405	450
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 498.340 కిలోలు

న్యూస్‌రీల్

కన్యాకుమారి రైలు మళ్లింపు

కడప కోటిరెడ్డిసర్కిల్: కన్యాకుమారి–పూణె–కన్యాకుమారి (16381/82) రైలును దారి మళ్లించినట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. ఈ నెల 22 నుంచి 29వ తేదీ వరకు ఈ రైలు గుత్తి, ధర్మవరం, పాకాల మీదుగా కన్యాకుమారికి వెళ్తుందన్నారు. ప్రయాణీకులు ఈ విషయాన్ని గమనించి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని కోరారు.

కమలాపురం దర్గాకు ప్రొటోకాల్

కమలాపురం: పట్టణంలోని అబ్దుల్ గఫార్ షా ఖాద్రి దర్గాకు ప్రభుత్వం నుంచి చాదర్ సమర్పించి ప్రొటోకాల్ పాటించాలని మైనార్టీస్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ సెక్రటరి మహమ్మద్ ఇంతియాజ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏటా ఏప్రిల్ మాసంలో ఈ దర్గాలో ఉరుసు జరుగుతుంది. ప్రభుత్వం నుంచి చాదర్ సమర్పించాలని గత ఏడాది ఏప్రిల్‌లో కమలాపురం ఎమ్మెల్యే సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి విన్నవించారు. సీఎం చొరవతో అప్పటి జేసీ సాయికాంత్ వర్మ ఉరుసు ఉత్సవాల్లో చాదర్ సమర్పించారు. తాజాగా శాశ్వత ప్రొటోకాల్ పాటించాలంటూ ఉత్తర్వులు అందాయి. దర్గా పీఠాధిపతి ఫైజుల్ గఫార్ షాఖాద్రి, యువనేత ఇస్మాయిల్ హర్షం వ్యక్తం చేశారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈఓ

కడప ఎడ్యుకేషన్: బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని డీఈఓ ఎద్దుల రాఘవరెడ్డి పేర్కొన్నారు. కడప నగరంలోని బడి బయట పిల్లలపై ఆయన శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇంటింటి సర్వే చేసి గత ఏడాది ఎనిమిదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి సమస్యలను తెలుసుకున్నారు. పనులు మాన్పించి బడికి పంపాలని సూచించారు. పిల్లల కోసం ప్రభుత్వం అన్ని వసతులు కల్పించిందని తెలిపారు. డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్వనాథరెడ్డి, కేవీ.సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పనులు వేగవంతం

ప్రొద్దుటూరు: త్వరలో స్టీల్ ప్లాంట్ పనులు వేగవంతం అవుతాయని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మున్సిపాలిటీ ఆధ్వ ర్యంలో రూ.2కోట్ల వ్యయంతో నిర్మించిన సిరిపురి కాంప్లెక్స్‌ను ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డితో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మీడియాతో మాట్లాడుతూ కొన్ని నెలల క్రితం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి భూమి పూజ చేశారన్నారు. ఏపీ హైగ్రేడ్ స్టీల్ ప్లాంట్‌ను జిందాల్ స్టీల్ ప్లాంట్‌గా కన్వర్ట్ అవుతుందని తెలిపారు. సంబంధిత కంపెనీకి ఈసీ వస్తే పనులు మొదలవుతాయన్నారు. జిందాల్ – జపనీస్ కంపెనీల మధ్య ఎంఓయూ కుదిరిందని, కొత్త టెక్నాలజీతో పనులు చేపట్టనున్నారని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ నిర్మాణంతో ప్రొద్దుటూరు, జమ్మలమడుగు ప్రాంతాలు జంట పట్టణాలుగా అభివృద్ధి చెందుతాయన్నారు.



గాలివీడు మండలం వెలిగల్లుకు చెందిన టి.భూదేవి (33)కి ఎముకలకు సంబంధించిన శస్త్ర చికిత్స చేయాల్సి వచ్చింది. ఈమెకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో వైద్యులు ఉచితంగా శస్త్ర చికిత్సతో వైద్యం చేసి ఇంటికి పంపారు. ఈమె ఇంటిలో విశ్రాంతి తీసుకున్నన్ని రోజులు వైఎస్సార్ ఆరోగ్య ఆసరా ద్వారా రూ.10వేల ఆర్థిక సహాయం అందించారు. ఆస్పత్రికి వచ్చి తిరిగి వెళ్లేవరకు పైసా ఖర్చు కాలేదు. మందులు కూడా ఉచితంగా అందించారు.



ధనియాన్‌చెరువుకు చెందిన యనమల బాబు (15)కు అపెండిసైటిస్ రావడంతో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద రాయచోటి నెట్‌వర్క్ ఆస్పత్రిలో వైద్యులు ఉచితంగా ఆపరేషన్ చేశారు. కోలుకున్న బాబుకు వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకం ద్వారా రూ.3వేలు అందించారు. శస్త్రచికిత్స తర్వాత వాడే మందులను ఉచితంగానే అందించగా కోలుకుంటున్నాడు.



పెద్దతిప్పసముద్రం పంచాయతీ కుమ్మరపల్లికి చెందిన దేవర చిన్నరాసన్నకు వ్యవసాయ పనులే జీవనాధారం. ఆరు నెలల క్రితం ద్విచక్ర వాహ నంలో ములకలచెరువుకు వెళుతుండగా పులికల్లు సమీపంలో ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. ఎడమ కాలు విరిగిపోయింది. మదనపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.40 వేల విలువ చేసే ఆపరేషన్‌ను ఉచితంగా నిర్వహించారు. ఆరోగ్యశ్రీ పథకం లేకుంటే మా లాంటి పేదలు ఆర్థికంగా నష్టపోతామని అంటున్నాడు.

ఆరోగ్యమస్తు

- ప్రజలకు మెరుగైన ఉచిత వైద్యం
- 2022 నుంచి నేటి వరకు ఆరోగ్యశ్రీ కింద 50,774 ఆపరేషన్లు
- ప్రభుత్వ ఖర్చు రూ.105.09 కోట్లు
- చికిత్స తర్వాత రోగులకు అందించిన ఆసరా సొమ్ము రూ.15.22 కోట్లు



బి.కొత్తకోట: పేదల వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేయడమేకాక డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తోంది.నూతనంగా ఏర్పడిన అన్నమయ్యజిల్లాలో పేదలు పొందిన వైద్యసేవలు దీనికి సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఖరీదైన, కార్పొరేట్ వైద్యం పొందలేని పేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరోగ్యశ్రీ పథకంలో చాలా మార్పులు తీసుకొచ్చారు పైసా ఖర్చు లేకుండా ఉచితంగా వైద్యం , శస్త్రచికిత్సలు పొందడం కోసం వ్యాధుల సంఖ్యను గణనీయంగా పెంచారు. శస్త్రచికిత్సలు పొందిన రోగులు ఇంట్లో విశ్రాంతి తీసుకోవాల్సిన పరిస్థితితో ఉపాధి కోల్పోతారు. వీరికోసం డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకాన్ని కొత్తగా తీసుకొచ్చి విశ్రాంతి కాలం బట్టి రోజకు రూ.225 అందిస్తున్నారు. దీనివల్ల రోగులకు ఆర్థిక ఇబ్బందులు తప్పుతున్నాయి.

పేదల వైద్యానికి రూ.105 కోట్లు

2022 ఏప్రిల్ నాలుగున అన్నమయ్య జిల్లా ఏర్పడింది. ఆరు నియోజకవర్గాల పరిధిలోని పేదలకు లక్షలు ఖర్చయ్యే వ్యాధులకు శస్త్రచికిత్సలు, వైద్యం, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా సేవలు పొందారు. 2022 ఏప్రిల్ 4 నుంచి 2023 అక్టోబర్ 18వ తేదీ వరకు జిల్లాకు చెందిన 50,774 మంది పేదలు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో శస్త్రచికిత్సలు, వైద్యం ఉచితంగా పొందారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.105, 09,03,315 ఖర్చు చేసింది. ఆరోగ్యశ్రీ ద్వారా 3,255 వ్యాధులకు ఉచితంగా వైద్యం అందిస్తున్నారు. ఆస్పత్రికి వెళ్లిన పేదలు సొంత డబ్బు పైసా ఖర్చు చేసే అవసరం లేకుండా వైద్యం పొంది సంతోషంగా ఇళ్లకు వెళ్లారు. ఆర్థిక స్థోమత లేని పేదలకు ఖరీదైన వైద్యం భారంగా మారి వారి జీవితాలను ఛిద్రం కాకుండా ప్రభుత్వం అండగా నిలుస్తోంది.

అండగా ఆసరా

డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా శస్త్ర చికిత్సలు పొంది ఇళ్లకు చేరిన రోగుల కోసం ప్రభుత్వం 1,519 వ్యాధులకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకం అమలు చేస్తోంది. చికిత్సలు పొంది ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాక తిరిగి కొలుకుని పనులు చేసుకునే వరకు వారిని ఆర్థికంగా అండగా నిలిచేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తోంది. చికిత్స చేసుకున్న వ్యాధి వల్ల ఎన్నిరోజులు విశ్రాంతి పొందాల్సి ఉంటుందో అన్ని రోజుల వరకు రోజుకు రూ.225 ప్రభుత్వం చెల్లిస్తుంది. చికిత్స పొందాక ఈ పథకం ఆర్థికంగా అండనిస్తోంది. దీనితో పేద రోజుల్లో మనోధైర్యం కలుగుతోంది. ఆసరా ద్వారా రోగులకు ఏడాదిన్నరలో రూ.15.22 కోట్లు చెల్లించారు.

జిల్లాలో ఏడాదిన్నరలో శస్త్రచికిత్సలు, వ్యయం

మండలం	చికిత్సలు	ఖర్చు (రూ.కోట్లలో)
పెద్దమండ్యం	653	1.39
తంబళ్లపల్లె	1,614	3.31
ములకలచెరువు	705	1.32
బి.కొత్తకోట రూరల్	1,992	4.07
కురబలకోట	596	1.25
గుర్రంకొండ	1,615	3.58
కలకడ	587	1.22
కేవీపల్లె	2,206	4.12
పీలేరు	3,527	6.79
కలికిరి	2,323	4.46
వాల్మీకిపురం	1,476	2.87
నిమ్మనపల్లె	587	0.99
మదనపల్లె రూరల్	2,073	4.22
రామసముద్రం	1,642	3.35
పెద్దతిప్పసముద్రం	893	1.93
మదనపల్లె అర్బన్	824	1.73
రాజంపేట అర్బన్	558	0.98
బి.కొత్తకోట అర్బన్	1	0.02
రాయచోటి రూరల్	544	1.03
లక్కిరెడ్డిపల్లె	1,970	4.09
రామాపురం	1,711	3.67
వీరబల్లి	1,710	3.67
రాజంపేట రూరల్	1,211	2.63
నందలూరు	1,729	3.53
పెనగలూరు	1,824	4.03
చిట్వేలి	770	1.72
కోడూరు	3,272	6.86
ఓబులవారిపల్లె	904	1.99
పుల్లంపేట	1,552	3.12
టి.సుండుపల్లె	963	1.92
సంబేపల్లె	786	1.58
చిన్నమండెం	1,788	4.04
రాయచోటి అర్బన్	3,710	8.19
గాలివీడు	2,519	5.28

జిల్లాలో ఆసరా చెల్లింపులు

ఏడాది	రోగులు	చెల్లింపు (రూ.కోట్లలో)
2019–20	3,875	2.51
2020–21	10,204	5.84
2021–22	18,756	8.94
2022–23	23,880	11.51
2023–24	8,151	3.71

ఈవీఎంల పరిశీలనకు హాజరు కావాలి

రాయచోటి: జిల్లా కేంద్రంలో ఈవీఎంల మొదటి విడత పరీక్షించే పరిశీలనకు రాజకీయ పార్టీలు తప్పనిసరిగా హాజరు కావాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లాలో 2024 ఓటరు జాబితా సంక్షిప్త సవరణ అంశంపై వివిధ రాజకీయ పార్టీలతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం ఈవీఎంలకు ఫస్ట్ లెవల్ చెకింగ్ జరుగుతోందన్నారు. ఇప్పటి వరకు ఒక్కొక్కటి 650 చొప్పున సీయూలు, బీయూలు, మూడు వీవీ ప్యాట్‌లు డిఫెక్ట్ ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. అలాగే ఓటరు జాబితా సవరణకు సంబంధించి వివిధ రాజకీయ పార్టీల నుంచి వచ్చిన దరఖాస్తులన్నింటినీ పరిశీలన చేయాలని నియోజకవర్గ ఈఆర్‌ఓలను ఆదేశించారు. తంబళ్లపల్లి, మదనపల్లి, కోడూరు నియోజకవర్గాల్లో రాజకీయ పార్టీల నుంచి అందిన వాటిని ఇంటింటికి వెళ్లి పరిశీలన చేసి పరిష్కరించాలని చెప్పారు. ఒకే డోర్ నెంబర్‌పై ఎక్కువ ఓట్లు ఉన్నవి, జంక్ క్యారెక్టర్ ఓట్లను పక్కాగా తనిఖీ చేయాలన్నారు. ఈనెల 27న ముసాయిదా జాబ్ ఓటరు జాబితా పబ్లిష్ చేయనున్నట్లు రాజకీయ వివరించారు. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు అడిగిన సందేహాలకు కలెక్టర్ సమాధానాలు ఇచ్చారు. సమావేశంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, రాయచోటి, రాజంపేట ఆర్డీఓలు రంగస్వామి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో అవే ఛార్జీలు



కడప కోటిరెడ్డిసర్కిల్: దసరా పండగ సందర్భంగా సాధారణ ఛార్జీలతోనే ప్రత్యేక సర్వీసులను నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. ప్రయాణీకులపై ఎలాంటి అదనపు ఛార్జీల భారం వేయడం లేదని స్పష్టం చేశారు. విజయవాడ, హైదరాబాదు, చెన్నై, బెంగుళూరు, విశాఖపట్టణం, కాకినాడ, తిరుపతి, అనంతపురం, కర్నూలు, నెల్లూరు, చిత్తూరు, మదనపల్లె తదితర ప్రాంతాలకు సర్వీసులు నడుపుతున్నామన్నారు. రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణీకులకు ఛార్జీలో పది శాతం రాయితీ ఇస్తున్నామన్నారు. అధికారులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేలా డ్యూటీలు వేశామన్నారు.

సమస్యలు సత్వరం పరిష్కరించాలి



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ గిరీషా పీఎస్. చిత్రంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తదితరులు

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రామాపురం: 'జగనన్నకు చెబుదాం స్పందన'కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మండలస్థాయిలో 'జగనన్నకు చెబుదాం – స్పందన'కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్డీఓ రంగస్వామిలు స్పందనలో వచ్చిన ఆర్జీలను స్వీకరించారు. శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలు గ్రామాల్లోనే పరిష్కరించాలనే ఉద్దేశంతో జగనన్నకు చెబుదాం మండల స్థాయి స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో 90శాతం మేర సమస్యలను పరిష్కరించడం జరుగుతోందన్నారు. రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. గతంలో ప్రజలు ప్రభుత్వ పథకాలు పొందాలంటే కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, నేడు సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటివద్దనే అందుతున్నాయన్నారు.ఎంపీపీ జనార్దన్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ విశ్వనాథరెడ్డి, ఎంపీటీసీ వెంకటసుబ్బారెడ్డి, సర్పంచ్ నాగభూషణ్‌రెడ్డి పాల్గొన్నారు.

కోట్లు గుంజి..బోర్డు తిప్పేసి..

- పట్టర్లు దించిన 9 ఎఫ్ ఎక్స్ గ్లోబల్ ట్రేడింగ్..
- కోట్లాది రూపాయల మోసం
- కుమిలిపోతున్న లబ్ధిదారులు



మూసివేసిన 9 ఎఫ్ఎక్స్ కార్యాలయం

రాయచోటి: మోసగించడం, మోసపోవడం మనిషి లక్షణంగా మారింది. ప్రతిరోజు ఏదో ఒక ప్రాంతంలో చీటీలు ట్రేడింగ్‌లు, స్కీమ్‌ల పేరుతో కోట్ల రూపాయలు మునిగిపోయాయని వార్తలు వస్తున్నా రెట్టింపు డబ్బులు వస్తాయన్న గ్లోబల్ ప్రచారాలతో ఆశలకు హద్దులు లేకుండా సాగుతున్న పెట్టుబడిదారులు మోసపోతున్నారు. కొన్ని నెలలు క్రిందటనే జీవి ఫుట్బాల్ పేరుతో కోట్ల రూపాయలు పోగొట్టుకున్న ప్రజలు నేడు 9 ఎఫ్ ఎక్స్ క్లోబల్ ట్రేడింగ్ కంపెనీ మోసానికి బలయ్యారు. 9 ఎఫ్ఎక్స్ గ్లోబల్ ట్రేడింగ్ కంపెనీ 2002లో ప్రారంభమైంది.తిరుపతి కేంద్రంగా రసూల్ అనే వ్యక్తి ప్రారంభించాడు. ఏడాది తిరగక ముందే రాయచోటి, కడప, రాజంపేట, బద్వేల్, నెల్లూరు, తిరుపతి తదితర ప్రాంతాల్లో కార్యాలయాలు తెరిచి వేల మంది సభ్యులను చేర్చుకున్నారు. కోట్లాది రూపాయలకుపైగా డబ్బులను రాబట్టి బోర్డులు తిప్పేసి, షట్టర్లు దించేశారు. ప్రతి కార్యాలయ పరిధిలో పది మందికిపైగా ఏజెంట్లను ఏర్పాటు చేసి నయా మోసానికి తెరతీశారు. లక్ష రూపాయలు చెల్లించిన సభ్యునికి రెండు, మూడు నెలల్లోనే రెండు లక్షలకు అధిపతులు అవుతారని నమ్మించి.. కొంతమందికి మాత్రమే లబ్ధి చేకూర్చి.. వేల మందికి చెందిన కోట్ల రూపాయల నిధులను నొక్కేసిన వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ స్కీమ్‌లో డబ్బులు చెల్లించిన సభ్యులకు ఐదారు నెలలుగా కార్యాలయాలు తెరవకుండా చెల్లించిన డబ్బులకు రెట్టింపు, వడ్డీలు చెల్లించకపోవడంతో తామంతా మోసపోయామన్న నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. కార్యాలయాలు మూతపడ్డాయి, తాము కట్టిన డబ్బులకు గ్యారెంటీ ఎక్కడ అంటూ కొంతమంది లబ్ధిదారులు ఏజెంట్లను వెంటపడినట్లు సమాచారం. పెట్టుబడి పెట్టిన వాళ్లకు నష్టం రాకుండా నెల్లూరు జిల్లా కావలి సమీపంలో వందల ఎకరాల భూమిని కొనుగోలు చేసి అక్కడ ఎర్రచందనం, టేకు, ఇతర ఖరీదైన మొక్కలను నాటించి వాటి ద్వారా లాభాలను అందిస్తామని నమ్మబలికినట్లు మరో సమాచారం. కానీ నాలుగు నెలలుగా ఆ భూముల విషయం కూడా ప్రస్తావనకు తేకుండా ఏజెంట్లు తప్పించుకొని తిరుగుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. 9 ఎఫ్ఎక్స్ గ్లోబల్ ట్రేడింగ్ మోసాలకు అన్నమయ్య, బాలాజీ, నెల్లూరు, వైఎస్సార్ జిల్లాలోని ప్రజలు బలి కావాల్సి వచ్చింది.ఎవరికీ చెప్పుకోవాలో తెలియక వీరు దిక్కులు చూస్తున్నారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ ట్రేడింగ్ మోసాలపై అన్నమయ్య జిల్లా పోలీసులు గుట్టుగా వివరాలను సేకరిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ఎలాంటి ఫిర్యాదులు రాలేదు: డీఎస్పీ

చీటీలు, ట్రేడింగ్‌ల పేరుతో మోసాలకు గురైనట్లు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని రాయచోటి డీఎస్పీ మహబూబ్ బాషా అన్నారు. 9 ఎఫ్ఎక్స్ గ్లోబల్ కంపెనీ మోసాలపై డీఎస్పీని ప్రశ్నించగా పై సమధానం చెప్పారు. డబ్బులు చెల్లించి మోసపోయినట్లు ఒక ఫిర్యాదు వచ్చినా కేసు నమోదు చేసి అన్ని కోణాలలో విచారణ చేపడతామన్నారు.

నేతల అంతర్మథనం

- పచ్చనేతల మాయమాటలపై తిరగబడతున్న ప్రజానీకం
- తెలుగుతమ్ముళ్లకు అందుతున్న ప్రభుత్వ పథకాలు
- జిల్లాలో అర్హులకు రూ.7,197.48 కోట్లు లబ్ధి



సాక్షి ప్రతినిధి, కడప: అర్హత ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి. పార్టీలు, వర్గాలకతీతంగా సంక్షేమం అండగా నడిపిస్తోంది. నాటి చంద్రబాబు సర్కార్‌లో ఉన్నట్లు జన్మభూమి కమిటీల సిఫార్సులు అవసరం లేదు. ప్రజల వద్దకే పాలన వచ్చి చేరింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి అపార ప్రజా మద్దతు దక్కుతోంది. ఈ పరిస్థితుల్లో తెలుగుదేశం ఇన్‌ఛార్జులు కల్లిబొల్లి కబుర్లతో ప్రజల చెంతకు చేరితే, ప్రతిఘటన ఉత్పన్నమవుతోంది. ప్రజానీకం నిలదీస్తే సమాధానం చెప్పుకోలేక, వ్యక్తిగత దూషణలకు దిగుతోన్న నేపథ్యం తెరపైకి వస్తోందని పరిశీలకులు భావిస్తున్నారు.

- 2019, మే నెల 30న సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఆదే రోజున వర్గాలు, పార్టీలు, ప్రాంతాలను చూడకుండా రాజకీయాలకతీతంగా నవరత్నాలు అందిస్తామని స్పష్టం చేశారు. చెప్పిన మాట ప్రకారం తర, తమ, భేదం లేకుండా పథకాలకు అర్హులైతే గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా లబ్ధి చేకూరుతోంది. ఇందులో తెలుగుతమ్ముళ్లకు సైతం సంక్షేమం వర్తిస్తోంది. అప్పట్లో తెలుగుతమ్ముళ్ల నేతృత్వంలో ఏర్పాటైన జన్మభూమి కమిటీల లాగా, మరెలాంటి సిఫార్సులు అవసరం లేదు. నాటి పరిస్థితులను పూర్తిగా తిరగరాశారు. పాలన ప్రక్షాళన చేశారు. అర్హుల ఇళ్ల ముంగిటకు సంక్షేమం తీసుకెళ్లారు. కోవిడ్ వైరస్ విపరీతంగా వ్యాప్తి చెందిన వ్యవస్థలు అస్తవ్యస్థమైనా, సంక్షేమాన్ని ఆపలేదు. వెరశి ప్రజల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజల నుంచి మద్దతు దక్కుతోంది.

రూ.7,197.48 కోట్లు లబ్ధి...

రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు వివిధ పథకాల ద్వారా రూ.7,197.48 కోట్లు నేరుగా లబ్ధి చేకూర్చింది. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు దక్కాయి. ఈ క్రమంలో టీడీపీ క్రియాశీలక నేతలకు సైతం పెద్ద ఎత్తున సంక్షేమం దక్కింది. బద్వేల్ మున్సిపాలిటీలో టీడీపీ కౌన్సిలర్ సోమేశుల సుధామణి కుటుంబానికి రూ.11.6 లక్షలు సమకూరింది. ఖాజీపేట మండలశాఖ అధ్యక్షుడు తిప్పిరెడ్డి లక్ష్మీరెడ్డి కుటుంబానికి రూ.5.25 లక్షలు దక్కింది. చాపాడు టీడీపీ నేత మార్తల నరసింహారెడ్డి కుటుంబానికి దాదాపు రూ.4 లక్షల లబ్ధి చేకూరింది. జిల్లా వ్యాప్తంగా టీడీపీ క్రియాశీలక నేతలందరికీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్‌లో సంక్షేమ ఫలాలు దక్కాయి. టీడీపీ సామాన్య కార్యకర్త నుంచి ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్న నేతల వరకూ అర్హుల జాబితాలో ఉండడం మరో విశేషం.

విమర్శిస్తే సహించని ప్రజానీకం

తెలుగు తమ్ముళ్లు ప్రభుత్వాన్ని విమర్శిస్తే సామాన్య ప్రజలు సహించలేకున్నారు. కడపలోని వైఎస్సార్ కాలనీలో ఇన్‌చార్జి మాధవీరెడ్డి మాటలను ఖండిస్తూ అడ్డుతగిలిన నేపథ్యమే ఇందుకు ఉదాహరణ. ఈ పరిస్థితిలో రెచ్చిపోయిన అమె వ్యక్తిగతంగా మంత్రి అంజాద్‌బాషాపై ఆరోపణలు సంధించడం ఆరంభించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు, మైదుకూరు, కమలాపురం టీడీపీ ఇన్‌ఛార్జిలు గండ్లూరు ప్రవీణ్ కుమార్‌రెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్, పుత్తా నరసింహారెడ్డిలు ఇలాగే వ్యవహరిస్తున్నారు. వ్యక్తిగత విమర్శలు మినహా ప్రజలకు పథకాలు అందలేదని కానీ, ఎన్నికలకు ముందు ప్రకటించిన మ్యేనిఫెస్టో అమలు చేయలేదని కానీ ఆరోపణలు చేయడం లేదని పరిశీలకులు వెల్లడిస్తున్నారు. ప్రజల నుంచి టీడీపీ నేతలకు ప్రతిఘటన ఉత్పన్నం కావడం వెనుక పైరవీలు లేకుండా అందుతున్న సంక్షేమ పథకాలేనని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం – 1ను పీడీ ధనలక్ష్మి శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం పీడీ మాట్లాడుతూ సమయపాలన పాటించాలని, పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీఓ సౌభాగ్యమ్మ, సీడీపీఓ సరళా దేవి, సూపర్‌వైజర్ అనసూయమ్మ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఎరువుల అమ్మకాలు

రాయచోటి : జిల్లాలోని అన్ని ఆర్బీకేలలో పారదర్శకంగా ఎరువుల అమ్మకాలను చేపట్టాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాలులో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అధ్యక్షతన కమిటీ సభ్యులు వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన విధంగా ఆర్బీకేలలో అందుబాటులో ఉన్న ఎరువులను అవినీతికి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి

చోటు లేకుండా సరఫరా చేయాలన్నారు. రైతులకు అవసరమైన ఎరువుల నిల్వలు ఉండేలా చూడాలన్నారు. అలాగే వ్యవసాయ శాఖకు అనుబంధంగా ఉపాధి హామీ పనులను కూడా అమలు చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మండల వ్యవసాయ అధికారులు రైతు భరోసా కేంద్రాల సిబ్బందితో కలిసి సమన్వయంగా పని చేయాలని సూచించారు. రైతులకు అవసరమైన వ్యవసాయ, ఉద్యాన పంటలపై కలికిరి, అనంతరాజుపేటలలోని శాస్త్రవేత్తలు అవగాహన కల్పించాలని సూచించారు.

అందుబాటులో 14 వేల మెట్రిక్ టన్నులు

జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్రనాయక్ మాట్లాడుతూ ఆర్బీకేల ద్వారా ఇప్పటి వరకు 8900 మెట్రిక్ టన్నుల ఎరువులు అమ్మారని, ఇంకా 4500 మెట్రిక్ టన్నుల ఎరువులు నిల్వ ఉన్నట్లు తెలిపారు. అదే విధంగా జిల్లాలో అన్ని రకాల ఎరువులు 14000 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లాలో ఎక్కడ కూడా ఎరువులు, విత్తనాల కొరత రానీయకుండా వ్యవసాయ శాఖ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ సలహా మండలి సభ్యులు బోడే షావలి, సహాయ వ్యవసాయ అధికారులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్‌సీపీలో 60 కుటుంబాల చేరిక



ఎంపీ, ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న కుటుంబాలు

రైల్వేకోడూరు : అనంతరాజుపేట పంచాయతీలో ఎంపీటీసీ బండారు మల్లికార్జున ఆధ్వర్యంలో 60 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారు ఎంపీ మిథున్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ముప్పాల హేమనవర్మ సమక్షంలో చేరారు. అలాగే పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ సుబ్బరామరాజు, సుధాకర్ రాజు, రత్నమ్మ, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు

మదనపల్లె : ద్విచక్రవాహన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బి.కొత్తకోట మండలం గోళ్లపల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు వై.కుమార్(35) కూలీ పనులు చేసి జీవిస్తున్నాడు. శుక్రవారం ద్విచక్రవాహనంలో వస్తూ.. గోళ్లపల్లె సమీపంలోని ఉమాశంకర్‌కాలనీ వద్ద స్నేహితుడితో కలిసి రోడ్డుపక్కన నిలిచిఉన్న కోటవూరు పంచాయతీ చేకులకుంటపల్లెకు చెందిన మారెప్ప కుమారుడు ఇ.వెంకటేష్(23) అనే ఎంబీఏ విద్యార్థిని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో కుమార్, వెంకటేష్ తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కొత్తకోట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌కు చెందిన నాగిరెడ్డి కుమారుడు రమేష్(28) మణప్పురం గోల్డ్ కంపెనీలో పని చేస్తున్నాడు. గత మూడు నెలల కాలానికి సంబంధించి లావాదేవీలు పరిశీలించిన అధికారులు 160 గ్రాముల బంగారు తక్కువగా ఉండటంతో బ్రాంచిలోని ఉద్యోగులందరిపై భారం మోపారు. ఎవరి వల్ల తప్పు జరిగిందో తేల్చేందుకు చర్యలు చేపట్టారు. దీంతో రమేష్ శుక్రవారం ఉదయం గొంతుకోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించగా, చికిత్సల అనంతరం ఇంటికి తీసుకెళ్లారు. అదే విధంగా నిమ్మనపల్లె పంచాయతీ నాగంవారిపల్లెకు చెందిన మల్లికార్జున భార్య సి.సంధ్య(23) కడుపునొప్పి తాళలేక యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి 108 అంబులెన్స్ వాహనంలో తరలించారు. వైద్యుల చికిత్సల అనంతరం ఆమె కోలుకుంటోంది. సంబంధిత పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనల ప్రకారం పునరావాస కల్పన

ఏపీఎండీసీ ఎండీ వీజీ వెంకట్‌రెడ్డి

ఓబులవారిపల్లె : ప్రభుత్వ నిబంధనల ప్రకారం మంగంపేట కాపుపల్లె, దళితవాడ, అరుంధతివాడ గ్రామాల ప్రజలకు పునరావాసం కల్పించడం జరుగుతుందని ఏపీఎండీసీ ఎండీ వీజీ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మంగంపేట ఏపీఎండీసీ ఆవరణలో పునరావాస గ్రామాల ప్రజలతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు గ్రామాల ప్రజలకు త్వరితగతిన పునరావాసం కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. గ్రామాల తరలింపునకు పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకొన్నామని, ఇందుకు నిధులు విడుదల చేస్తామని పేర్కొన్నారు. కొంత మంది గ్రామస్తులు పునరావాస కల్పనలో తమ సమస్యలు, సందేహాలను ఎండీ దృష్టికి తీసుకొని వచ్చారు. ఇందుకు ఆయన స్పందిస్తూ ఇప్పటికే గ్రామాల తరలింపు కోసం పలు మార్లు అభిప్రాయ సేకరణ జరిగిందని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. అనంతరం మంగంపేట పునరావాస కల్పనకు ఏర్పాటు చేస్తున్న ఆర్‌ఆర్ 5లోని లేఅవుట్‌లను ఎండీ పరిశీలించారు. రోడ్ల అభివృద్ధి పనులు,



లేఅవుట్‌లను పరిశీలిస్తున్న ఎండీ వీజీ వెంకట్‌రెడ్డి

ప్లాట్‌లు, మౌలిక సదుపాయాల ఏర్పాట్లు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఏపీఎండీసీ అతిథి గృహంలో ఏపీఎండీసీ, అన్ని శాఖల అధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఓ సుదర్శన్‌రెడ్డి, తహసీల్దార్ పుల్లారెడ్డి, హౌసింగ్ డీఈ కుప్పుస్వామి, పంచాయతీరాజ్ డీఈ బాలనరసింహులు, సర్పంచ్ మినుగు సుధాకర్, సీనియర్ నాయకులు గుత్తిరెడ్డి హరినాథ్‌రెడ్డి, డీఆర్‌సీసీయూ బోర్డు మెంబర్ తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, నాయకుడు తల్లెం రమణారెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ వడ్డి సుబ్బారెడ్డి, గజ్జల శ్రీనివాసుల రెడ్డి, ఎంపీటీసీ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రన్నింగ్ రూమ్‌లో మెరుగైన సౌకర్యాలు



రికార్డులు పరిశీలిస్తున్న డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్

నందలూరు (రాజంపేట) : రన్నింగ్ రూమ్‌లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని గుంతకల్ డివిజనల్ రైల్వే మేనేజర్ మనీష్ అగర్వాల్ సూచించారు. శుక్రవారం ఆయన నందలూరు రైల్వే కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రన్నింగ్ రూమ్‌కు పెయింటింగ్ వేయించాలని, ప్రతి ఒక్కరికీ వేరుగా విశ్రాంత గదులు కేటాయించాలని ఆదేశాలు జారీ చేశారు. నందలూరు క్రూ సిస్టమ్ తరలింపు ఇప్పట్లో లేదని స్పష్టం చేశారు. గుంతకల్, రేణిగుంట రైల్వేస్టేషన్ల మధ్య ఎర్రగుంట్ల సెంటర్ పాయింట్ అయినందు వల్ల కొన్ని కార్యాలయాల తరలింపు జరిగిందన్నారు. నందలూరు అభివృద్ధి పనులపై పరిశీలన చేయడం జరుగుతుందన్నారు. ఈయన వెంట డివిజనల్ మేనేజర్ డాక్టర్ శ్రావణ్ కుమార్, సీనియర్ డీఈఈ సి.వీరయ్య, సీనియర్ డీఈఎన్ ఎలక్ట్రికల్ సంజీవ్ కుమార్, ఏడీఎన్ సయ్యద్ అహ్మద్‌అలీ, ఎస్ఎంఆర్ కమలాకర్, సీసీ వేణుగోపాల్, రైల్వే అధికారులు, ఆర్‌పీఎఫ్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ రాజంపేట సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో,
ఓ.ఎస్. నెంబర్ 158/2012

ఎర్రాయి రాయిరోత్ కాంటీ మీరత్ తండ్రి కున్ అబ్బుల్లా, కాట్రికప్పల్లి గ్రామం మరియు పోస్ట్, వయా చిల్లియప్పల్లి, రాలిరత్ జిల్లా, రేరళ స్టేట్, ఇండియా. ...వాది.

వర్సెస్

సయ్యద్ జహీరా సుల్తానా భర్త యూసుఫ్, ఉంగరాల నగర్, రైల్వే కోడూరు పోస్ట్ మరియు మండలం, కడప జిల్లా. ...2వ ప్రతి వాది

2 వ ప్రతివాదికి నోటీసు

ఇందు మూలంగా తెలియచేయడం ఏమనగా, పై తెలిపిన వాది, మిమ్ములను పై తెలిపిన దావా నందు 2వ ప్రతివాదిగా చేర్చినారు. సదరు దావా పై కోర్టులో 30.10.2023 న వాయిదా వున్నది. కావున మీరు, స్వయంగా కానీ లేదా న్యాయవాది ద్వారా కానీ, పై కోర్టులో 30.10.2023 న ఉదయం 10.30 గంటలకు హాజరై జవాబు దాఖలు చేసుకొనవలెను. అట్లు లేని యెడల, మీ పరోక్ష మందు కేసు తీర్మానించబడును.

//బై ఆర్డర్ ఆఫ్ ది కోర్ట్//

ఎస్. కృష్ణ కుమార్, ఎస్. గిరీష్ కుమార్
న్యాయవాదులు, రాజంపేట.

రైల్వేకోడూరు జీపీకి ఐఎస్‌ఓ గుర్తింపు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణ, గ్రామ పంచాయతీ (జీపీ)లో ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఆఫ్ స్టాండర్స్ సర్టిఫికెట్స్ కొరకు శుక్రవారం జిల్లా ఐఎస్‌ఓ కో–ఆర్డినేటర్ సోనియాజోష్ రెండోసారి పర్యటించి సంతృప్తి వ్యక్తం చేశారు. మరోసారి పర్యటనకు పారిశుధ్యంపై దృష్టిపెట్టి పనులన్నీ పూర్తి చేయాలన్నారు. అలానే ప్రజా అవసరాలను కల్పించడంలో నిబంధనలు పాటించాలన్నారు. అనంతరం ఉప సర్పంచ్ తోట శివసాయి, సర్పంచ్ శివయ్య, అధికారులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డీవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజాప్రతినిధులతో సమావేశమైన ఐఎస్‌ఓ కో-ఆర్డినేటర్

క్వారీ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ

ఓబులవారిపల్లె : మండలంలోని బోటుమీదపల్లి పంచాయతీలో క్వారీ ఏర్పాటు కోసం శుక్రవారం డీఆర్‌ఓ సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ బోటుమీదపల్లి పంచాయతీలో డీవీఎస్ మైన్స్ మినరల్స్ వారు సర్వేనెంబరు. 276లో దాదాపు 9 ఎకరాలలో క్వార్జ్ సున్నపురాయి క్వారీ ఏర్పాటుకు అనుమతులు కోరారన్నారు. ఇందుకోసం గ్రామంలో కాలుష్యం తదితర అంశాలపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకు గ్రామస్తులు కొంతమంది అనుకూలంగా, మరి కొంతమంది వ్యతిరేకంగా స్పందించారు. వారి అభిప్రాయాలను అధికారులు సేకరించారు. అనంతరం సంబంధిత సర్వే నెంబర్‌లో భూమిని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుల్లారెడ్డి, ఆర్ఐ రామ్మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.